సాక్షి
రంగారెడ్డి
శనివారం : 12 : అక్టోబర్ : 2024



వైద్య కళాశాలకు వినతి

షాద్‌నగర్‌లో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే శంకర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. 6లో►



ఆన్‌లైన్ బెట్టింగ్‌తో..

ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పులపాలై చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఓ వ్యక్తిని మాడ్గుల పోలీసులు రిమాండ్‌కు తరలించారు. 6లో►



ఎరువుల నిల్వలు ఉంచండి

రైతులకు ఎరువుల నిల్వలు అందుబాటులో ఉంచాలని సహకార శాఖ జిల్లా అధికారి సుధాకర్ అన్నారు. 6లో►

న్యూస్‌రీల్

అందరికీ దసరా శుభాకాంక్షలు

కలెక్టర్ శశాంక



సాక్షి, రంగారెడ్డి జిల్లా: విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కలెక్టర్ శశాంక జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకొనే విజయ దశమి వేడుకను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఈ పండుగ అందరికీ వెలుగు పంచాలని, విజయాలు చేకూర్చాలని, చేపట్టిన ప్రతీకార్యం సఫలీకృతం కావాలని కోరుకుంటున్నానని స్పష్టంచేశారు. అమ్మవారి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని, దుర్గామాత కరుణాకటాక్షాలతో అన్ని వర్గాలవారు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో జీవించాలని అభిలషించారు.

పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి

నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి



ఎంపీ మల్లురవికి స్వాగతం పలుకుతున్న శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

కడ్తాల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన మండల పరిధిలోని మైసిగండి గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఉమ్మడి పాలమూరు అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అభివృద్ధిలో పార్టీలకతీతంగా ప్రతీ ఒక్కరు భాగస్వామ్యులు అవ్వాలని కోరారు. పార్లమెంట్ పరిధిలోని ప్రజలంతా దసరా పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జవహర్‌లాల్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్, నాయకులు దశరథ్‌నాయక్, జగన్‌నాయక్, పత్యా, రమేశ్‌నాయక్, చందూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఈ-పాస్'తోనే ఎరువుల విక్రయం

నర్సింహారావు



రికార్డులు పరిశీలిస్తున్న నర్సింహారావు

కొత్తూరు: అధీకృత డీలర్లు ఈ పాస్ యంత్రం ద్వారానే ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు సూచించారు. శుక్రవారం ఆయన కొత్తూరు, గూడూరు, సిద్దాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం డీలర్లకు విత్తనాలు, ఎరువుల విక్రయాల్లో అనుసరించాల్సిన పద్ధతుల గురించి వివరించారు. రైతులకు తప్పని సరిగా రసీదులు ఇవ్వాలన్నారు. రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేయాలని సూచించారు. పంటల సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించడంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వ్యవసాయ ఖర్చులు తగ్గించుకునేందుకు యంత్రాలను వినియోగించాలన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం వరికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తుందని చెప్పారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి గోపాల్ పాల్గొన్నారు.

సంపత్ 'తీన్మార్'



యాచారం: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన పాలిటెక్నిక్ లెక్చరర్(ఆటో మొబైల్ కేటగిరీ) ఫలితాల్లో మండ ల కేంద్రానికి చెందిన కేశమోని సంపత్ గౌడ్ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. రెండు రోజుల క్రితం టీజీపీఎస్సీ ప్రకటించిన అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఫలితాల్లో కూడా అర్హత సాధించాడు. అంతేకాకుండా నాలుగు నెలల క్రితం ప్రకటించిన గ్రూప్‌- 4 ఫలితాల్లో జిల్లా స్థాయి లో 125 ర్యాంకు సాధించి ఉద్యోగానికి అర్హత సాధించాడు. మూడు కీలకమైన ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల సంపత్ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. తన సోదరులు కూడా కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో వారి స్ఫూర్తితో పట్టుదలతో చదివినట్లు సంపత్ చెబుతున్నాడు.



సమీకృత గురుకుల పాఠశాల భవనానికిభూమి పూజ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ప్రకృతి ఒడిలో.. చదువుల బడి

అధునాతన వసతులతో యంగ్ ఇండియా గురుకులానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం

- కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి సీఎం భూమి పూజ
- వేలాదిగా తరలివచ్చిన నాయకులు, విద్యార్థులు

షాద్‌నగర్/షాద్‌నగర్ రూరల్/కొందుర్గు: పల్లె ప్రకృతి ఒడిలో.. చదువులమ్మ బడిని తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యాధునిక వసతులతో నిర్మించతలపెట్టిన గురుకులానికి భూమి పూజ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి శుక్రవారం షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని కొందుర్గులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభకు విద్యార్థులు, నాయకులు, మహిళలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల, పరిగి ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, టి.రామ్మోహన్‌రెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం తదితరులు హాజరయ్యారు.

చిటపట చినుకులు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభ ప్రాంగణానికి హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో కొందుర్గుకు విచ్చేశారు. సీఎం వచ్చే సమయంలోనే వర్షం ప్రారంభమైంది. దీంతో ఆయన వర్షంలోనే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఓవైపు వర్షం.. మరో వైపు ఎండ రావడం ప్రత్యేకమైన వాతావరణంలో శంకుస్థాపన కార్యక్రమం కొనసాగింది.

ఎమ్మెల్యే కోరిక మేరకు..

అధునాత రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణంలో భాగంగా షాద్‌నగర్ మొదటి విడత జాబితాలో ఉండాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పట్టుబట్టారని.. కొందుర్గులో నిర్వహించే శంకుస్థాపనకు తప్పక హాజరవ్వాలని కోరారని ముఖ్యమంత్రి సభలో చెప్పారు. తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో నిర్వహించే కార్యక్రమానికి వెళ్లకుండా ఇక్కడకు వచ్చానంటే ఈ ప్రాంతవాసులపై తనకున్న మమకారాన్ని తెలుసుకోవాలని రేవంత్‌రెడ్డి అన్నారు.

ఆకట్టుకున్న ఆటాపాట

శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా బహిరంగ సభ వద్ద ఏఎస్.జంగిరెడ్డి కళాకారుల బృందం ఆటా పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి వారు ఆలపించిన పాటలు అలరించాయి. సుమారు మూడు గంటలకు పైగా ఆటాపాట కొనసాగింది.



సమీకృత గురుకుల పాఠశాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. కలెక్టర్ శశాంక

సీఎం సభ సైడ్‌లైట్స్

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 2.55గంటలకు హైదరాబాద్ నుంచి సభా ప్రాంగణానికి హెలికాప్టర్‌లో విచ్చేశారు.
- హెలిపాడ్ వద్ద సీఎంకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, స్థానిక నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.
- మధ్యాహ్నం 3.05గంటలకు ముఖ్యమంత్రి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, కాలె యాదయ్య, టి.రామ్మోహన్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.
- కొందుర్గు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో సీఎం ఫొటో దిగారు.
- రేవంత్‌రెడ్డి సభావేదికపైకి ఎక్కే సమయంలో విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.
- మధ్యాహ్నం 3.18గంటలకు వేదిక పైకి ఎక్కిన ఆయన 3.20గంటలకు జ్యోతి ప్రజ్వలన చేశారు.
- మధ్యాహ్నం 3.22గంటలకు రాష్ట్ర గీతం ఆలపించారు.
- 3.45గంటల నుంచి సాయంత్రం 4.07గంటలకు ముఖ్యమంత్రి ప్రసంగం కొనసాగింది.
- పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేశారు.
- నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి 20వేల మందికి పైగా నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తరలివచ్చారు.



శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో సాధన చేస్తున్న భారత జట్టు

ఉప్పల్‌లో గెలుపెవరిదో!

- భారత్‌- బంగ్లాదేశ్ మధ్య నేడు టీ20 మ్యాచ్
- భారీ భద్రతను ఏర్పాటు చేసిన పోలీసులు

ఉప్పల్: ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శనివారం జరగనున్న భారత్‌- బంగ్లాదేశ్ టీ20 క్రికెట్ మ్యాచ్‌కు భారీ భద్రతను ఏర్పాటు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2,600 మంది బలగాలతో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్టేడియం పరిసర ప్రాంతాల్లో 300 సీసీ కెమెరాలతో నిఘా ఉంచినట్లు చెప్పారు. ఇప్పటికే ఉప్పల్ స్టేడియం, పరిసర ప్రాంతాలను తమ అధీనంలోకి తీసుకున్నామన్నారు. సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ గదికి అనుసంధానం చేసినట్లు తెలిపారు.

3 గంటల ముందే అనుమతి..

సాయంత్రం 7 గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్‌కు మూడు గంటల ముందుగానే స్టేడియంలోకి టికెట్‌లు చెక్ చేస్తూ అనుమతిస్తారు. ఈవ్‌టీజింగ్‌లను అరికట్టేందుకు ప్రత్యేకంగా షీ టీం బృందాలు అందుబాటులో ఉంటాయి. స్టేడియంలోకి బయటి వస్తువులు, తినుబండారాలను తీసుకురావద్దు. కారు పాస్ ఉన్న వారు రామంతాపూర్ మీదుగా వచ్చి గేట్ నంబర్ 1, 2 ద్వారా తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవచ్చు. దివ్యాంగులు రామంతాపూర్ గేట్‌- 3 ద్వార వెళ్లాల్సి ఉంటుంది. గేట్ నంబర్ -4 నుంచి 10కి వచ్చే వారు తమ వాహనాలను ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ పాఠశాల వద్ద, రామంతాపూర్ చర్చి గ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి. క్రికెట్ మ్యాచ్ సందర్భంగా మెట్రో రైలు, ఆర్టీసీ సేవలను రాత్రి ఒంటి గంట వరకు పొడిగించనున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

మ్యాచ్ కొనసాగే సమయాల్లో ఉప్పల్ నుంచి స్టేడియం వైపు, సికింద్రాబాద్ నుంచి స్టేడియం వైపు వచ్చే అన్ని దారులను మళ్లించనున్నారు. వరంగల్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే భారీ వాహనాలు చెంగిచర్ల క్రాస్ రోడ్డు, చర్లపల్లి ఐవోసీ కేంద్రం, ఎన్‌ఎఫ్‌సీ నుంచి వెళ్లాలి. ఎల్‌బీనగర్ నుంచి వచ్చే వాహనాలు నాగోల్ మెట్రో స్టేషన్, ఉప్పల్ భగాయత్ నుంచి చెంగిచర్ల మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. సికింద్రాబాద్ నుంచి వచ్చే వాహనాలు సైతం నాచారం పారిశ్రామిక వాడ ద్వారా చెంగిచర్ల మీదుగా వరంగల్ వైపు వెళ్లాల్సి ఉంటుంది.

దుర్గమ్మా.. దీవించమ్మా..



లక్డీకాపూల్: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఘనంగా వేడుకలు జరిగాయి. శుక్రవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మ ఆశీస్సులతో నగరం సుభిక్షంగా ఉండాలని మేయర్ అభిలషించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విజయదశమి ధైర్యం, న్యాయం, సత్యం, ధర్మం, విజయాన్ని సూచిస్తుందన్నారు. దుర్గామాత కృపతో నగరం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.



మార్కెట్ యార్డు స్వాగత తోరణం

అర్ధ శతాబ్ది.. లక్ష్యాలు సిద్ధి

- పట్నంమార్కెట్.. ఆద్యంతం లాభాల బాట
- 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1.60 కోట్ల లక్ష్యం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డు త్వరలో 50 వసంతాలు పూర్తి చేసుకోనుంది. రైతులకు మెరుగైన సేవలందించేందుకు సుమారు 15 ఎకరాల్లో 1976 మార్చి 19న పట్నంలో యార్డును స్థాపించారు. మూడు ఎకరాల స్థలాన్ని 2000 సంవత్సరంలో పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి మార్కెటింగ్ శాఖ కేటాయించడంతో ప్రస్తుతం 12 ఎకరాల్లో మార్కెట్ కొనసాగుతోంది. మొదట్లో యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కందుకూరు మండలాలు ఈ మార్కెట్ పరిధిలో ఉండేవి. 2016లో మార్కెట్‌ను విభజన చేయడంతో కందుకూరు, మహేశ్వరం మండలాలు విడిపోయాయి.

మడిగెల నిర్మాణంతో ఆదాయం మెరుగు

48 సంవత్సరాలు పూర్తి చేసుకున్న మార్కెట్‌కు, వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయల మార్కెట్, ట్రేడ్ లైసెన్స్ వ్యాపారుల ద్వారా ఆదాయం సమకూరుతోంది. తాజాగా ఇందులో మడిగెలు, గోడౌన్ల నిర్మాణంతో అద్దె రూపేణా ఆదాయం మరింత పెరిగింది. 2017- 18 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.80.05 లక్షలు కాగా.. 2018- 19లో రూ.71.08 లక్షలు, 2019- 20లో రూ.89.20 లక్షలు, 2020-21లో రూ.1.19 కోట్లు, 2021-22లో రూ.1.05 కోట్లు, 2022-23లో రూ.1.30 కోట్లు, 2023-24లో రూ.1.30 కోట్లు, 2024-25కు రూ.1.60 కోట్లుగా టార్గెట్‌గా నిర్ణయించారు. గత సెప్టెంబర్ నెలలోనే 1.20 కోట్ల ఆదాయాన్ని రాబట్టింది. మిగతా ఆరు మాసాల్లో నిర్ణీత లక్ష్యాన్ని అధిగమిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

నాటి నుంచి లాభాల బాటే

మార్కెట్ స్థాపితం నుంచి చైర్మన్లుగా కుకుడపు రాజయ్య, మారెడ్డిపల్లి లచ్చిరెడ్డి, క్యామ మల్లేశ్, ఇందిరాల రమేష్, కుకుదాల అంజిరెడ్డి, అంబయ్యాయాదవ్, కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి, ఎర్పుల చంద్రయ్యలు పనిచేశారు. రైతుల కోసం మరుగుదొడ్లు, క్యూరిపై వాటర్ ఫిల్టర్‌తో పాటు రక్షణగా సీసీ కెమెరాలను, విద్యుత్ దీపాలను మార్కెట్ యార్డులో ఏర్పాటు చేశారు. నాగార్జునసాగర్‌- హైదరాబాద్ ప్రధాన రహదారిపై మార్కెట్ యార్డు ఉండటంతో, ఇక్కడ నిర్మించిన మడిగెలకు కమర్షియల్‌గా భారీగా ఆదాయం సమకూరుతోంది. అంతిమంగా యార్డు నాటి నుంచి లాభాల బాటలో పయనిస్తోంది.

టార్గెట్ పూర్తి చేస్తాం



మార్కెటింగ్ శాఖ నిర్ణయించిన టార్గెట్‌ను గడువులోపే పూర్తి చేస్తాం. ఈ సంవత్సరం రూ.1.60 కోట్ల లక్ష్యానికి.. గత సెప్టెంబర్‌లో రూ.1.20 కోట్లు రాబట్టాం. యార్డు అభివృద్ధికి, రైతులకు సౌకర్యం కల్పించేందుకు అన్నివిధాలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోనే అధిక ఆదాయం సాధించే విధంగా మార్కెట్‌ను తీర్చిదిద్దుతాం.

– సంతోష్‌కుమార్, మార్కెట్ యార్డు కార్యదర్శి, ఇబ్రహీంపట్నం

రూ. 25 వేలు ఎక్కడ?

మూసీ నిర్వాసితులకు చేయూతలో ఆలస్యం



- డబుల్ బెడ్రూం ఇళ్లకు తరలించేముందు బాధితులకు హామీ
- 15 రోజులు గడిచినా అమలు చేయని అధికార యంత్రాంగం

సాక్షి, సిటీబ్యూరో: మూసీ నిర్వాసితులకు రూ.25 వేలు ఆర్థిక చేయూత అందని ద్రాక్షగానే మారింది. మూసీ ప్రక్షాళనలో భాగంగా నదీ గర్భంలోని నివాసాలు ఖాళీ చేసి పునరావాసం కింద డబుల్ బెడ్రూం ఇళ్లకు తరలి వెళ్లే కుటుంబానికి రూ.25 వేలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక అడుగు ముందుకు వేసి పత్రిక ప్రకటన కూడా విడుదల చేశారు. మూసీ పరీవాహక పరిధిలోని సైదాబాద్, హిమాయత్‌నగర్, నాంపల్లి మండలాల్లోని వివిధ బస్తీలకు చెందిన సుమారు 193 కుటుంబాలను మలక్‌పేటలోని పిల్లిగుడిసెలు, జియాగూడ, ప్రతాప సింగారం డబుల్ బెడ్రూం గృహ సముదాయాలకు తరలించారు. నిర్వాసితులు ఇళ్లు ఖాళీ చేసి సామగ్రిని డబుల్ బెడ్రూం ఇళ్లకు తరలించేందుకు వాహనాలను సైతం అధికార యంత్రాంగమే ఏర్పాటు చేసింది. అయితే.. నిర్వాసితులను మరింత ప్రోత్సహించే విధంగా తక్షణ ఆర్థిక చేయూత కింద రూ. 25 వేలు అందిస్తామని ప్రకటించింది. కానీ.. 15 రోజులు గడిచినా ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఆర్థిక చేయూత అందించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

నిర్వాసితుల కోసం హెల్ప్ డెస్కులు

మూసీ పునరావాస కుటుంబాల ఆరేళ్ల పిల్లలకు సమీపంలోని అంగన్ వాడీల్లో ప్రవేశాలు కల్పించడం, మహిళా స్వయం సహాయ సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇప్పించడం కోసం ప్రత్యేక అధికారుల బృందాలు ఏర్పాటు చేసి పనితీరు అంతంత మాత్రంగా తయారైంది. జీహెచ్‌ఎంసీలోని యూసీడీ విభాగం ద్వారా జీవనోపాధి కోసం సర్వే చేయడం, మెప్మా ద్వారా బ్యాంకు లింకేజీలు సులభతరం చేయడం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల సహకారంతో వివిధ సంక్షేమ పథకాల కోసం అర్హులైన వారిని గుర్తించడం, విద్యార్థులకు వారి సమీపంలోని పాఠశాలలు, రెసిడెన్షియల్ సంక్షేమ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించేలా చూడటం బృందాల బాధ్యతలుగా ప్రభుత్వం ఆదేశించింది. నిర్వాసితులకు ఎప్పటికప్పుడు సహాయంగా ఉండేందుకు హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయడం, పౌర సమాజంతో కమిటీ సంప్రదింపులు జరుపుతుండటం చేయాలని ప్రభుత్వం సూచించింది.

జీవనోపాధి కమిటీ ఏర్పాటు..

నదీ గర్భంలో నివాసాలు కోల్పోయిన బాధిత కుటుంబాల కోసం ప్రభుత్వం, విద్య, ఉపాధి కల్పన కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. సెర్ప్ సీఈఓ చైర్మన్‌గా, జీహెచ్‌ఎంసీ కమిషనర్ వైస్ చైర్మన్‌గా 14 మంది సభ్యులతో జీవనోపాధి కమిటీని ఏర్పాటు చేశారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ దాన కిషోర్ మెంబర్ కన్వీనర్‌గా ఉన్న ఈ కమిటీలో మైనార్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖతోపాటు పాఠశాల విద్య కమిషనర్, తెలంగాణ గురుకుల పాఠశాలల కార్యదర్శులు సభ్యులుగా ఉన్నారు.

జలమండలి స్థలం ఆక్రమణకు యత్నం!

సాక్షి,సిటీబ్యూరో: జలమండలి స్థలం ఆక్రమణ యత్నాన్ని అధికారులు అడ్డుకున్నారు. వివరాలు ఓ అండ్ ఎం డివిజన్ నం.7 మహీంద్ర హిల్స్ పరిధిలో సర్వే నంబర్.844/1 లో జలమండలికి 8072 చదరపు మీటర్ల స్థలం ఉంది. సదరు స్థలంలో అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించగా అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి భూమి తమదిగా పేర్కొంటూ అడ్డుకున్నారు. దీంతో జలమండలి విజిలెన్స్ బృందంతో పాటు జనరల్ మేనేజర్ తదితరులు స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లగా ఆత ను వారితో ఘర్షణకు దిగడంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జలమండలి అధికారుల ఫిర్యాదు మే రకు మారేడ్‌పల్లి తహసీల్దార్ భూమిని సర్వే చేసి జలమండలికి చెందినదిగా ని ర్ధారించారు. అందుకు సంబంధించిన ధ్రువపత్రాలను తుకారం గేట్ పోలీస్ స్టేషన్‌లో సమర్పించారు. జలమండలి కి సంబంధించిన భూములు, స్థలాలను ఎవరైనా ఆక్రమించాలని చూస్తే. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్కామ్ కోసం సంస్థను తెరిచాడు!

- ఈవీ వాహనాల 'క్రయ విక్రయం' కుంభకోణం
- ఫైనాన్స్ సంస్థల్ని మోసం చేస్తూ 50 వాహనాల కొనుగోలు
- తక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకున్న ముఠా
- ప్రభుత్వ సబ్సిడీ స్వాహా
- కొందరు ఏజెంట్ల పాత్రపై ఆధారాలు లభ్యం
- దర్యాప్తు ముమ్మరం చేసిన నగర పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: ఎలక్ట్రిక్ వాహనాలను (ఈవీ) ఆధారంగా చేసుకుని ఇటు ఫైనాన్స్ సంస్థల్ని, అటు ప్రభుత్వాన్ని మోసం చేసిన గ్యాంగ్ కేసు దర్యాప్తులో కీలకాంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ స్కామ్ కోసం ఓ ముఠా సభ్యుడు ఏకంగా సంస్థను తెరిచినట్లు నగర పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో కొన్ని ఫైనాన్స్ సంస్థలకు చెందిన ఏజెంట్ల పాత్రను అనుమానిస్తున్న అధికారులు ఆ కోణంలోనూ ఆరా తీస్తున్నారు. ఐదుగురు సభ్యుల్లో నలుగురిని మూడు రోజుల క్రితం అరెస్టు చేసిన సౌత్-ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వీరి నుంచి 28 ఎలక్ట్రిక్ వాహనాలు స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. ఈ కేసును దర్యాప్తు నిమిత్తం మలక్‌పేట పోలీసులకు అప్పగించారు. డబీర్‌పురకు చెందిన మీర్జా బాఖర్ అలీ బేగ్ తన స్నేహితుడైన జఫ్ఫార్ అలీ మూసీ్వతో కలిసి సెకండ్ హ్యాండ్ వాహనాల క్రయవిక్రయాలు చేసే వాడు. తన స్నేహితుడైన సయ్యద్ తన్వీర్ హుస్సేన్‌తో కలిసి భారీ స్కామ్‌కు పథక రచన చేశారు. తమ బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల్లో పేదలను గుర్తించి వారికి రూ.10 వేల నుంచి నుంచి రూ.20 వేలు చెల్లించేలా ఒప్పందం చేసుకుని గుర్తింపుకార్డులు తీసుకునే వారు. వీటి ఆధారంగా ఈవీ వాహనాలకు చెందిన షోరూమ్స్‌లో ఉండే ఫైనాన్స్ సంస్థల సహకారంతో వాహనాలను కొనుగోలు చేసేవారు. ఒక్కో వాహనం ఖరీదు రూ.1.6 లక్షలు ఉండగా... డౌన్ పేమెంట్‌గా రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు చెల్లించే వారు. వాహనాలు డెలివరీ తీసుకునేప్పుడు గుర్తింపుకార్డులు ఇచ్చిన వారినే తీసుకువచ్చి సంతకాలు చేయించడం, ఫొటోలు దింపడం చేసే వారు. ఆపై వాహనాన్ని తీసుకుని వారికి కొంత మొత్తం చెల్లించేవారు. అదే సమయంలో ఈవీ వాహనాలకు ప్రభుత్వం చెల్లించే సబ్సిడీ రూ.27 వేల కోసం దరఖాస్తు సైతం చేయించే వారు. ఈ వాహనాలను సెకండ్ హ్యాండ్ మార్కెట్‌లో విక్రయించడానికి తమ స్నేహితుడైన బహదూర్‌పుర వాసి సయ్యద్ తన్వీర్‌కు అప్పగించే వారు. స్టేషనరీ దుకాణం నిర్వహించే అతను ఈ దందా కోసం ఏకంగా రజ్వీ మోటర్స్ పేరుతో డబీర్‌పురలో ఓ దుకాణమే తెరిచాడు. ఫైనాన్స్ చెల్లించని వారి నుంచి సీజ్ చేసినవి అంటూ ఈ వాహనాలకు పలువురికి గరిష్టంగా రూ.లక్షకు విక్రయించే వారు. ఆర్సీ సహా ఇతర పత్రాలు రావడానికి సమయం పడుతుందంటూ నమ్మబలికే వాళ్లు. ఇందులో కొన్ని వాహనాలను మలక్‌పేటకు చెందిన సచిన్ ద్వారా విక్రయించారు.అలా వచ్చిన మొత్తాన్ని అందరూ పంచుకునే వారు. గరిష్టంగా ఆరు నెలలకు సబ్సిడీ మొత్తం గుర్తింపుకార్డులు ఇవ్వడం ద్వారా వాహనం యజమానిగా వ్యవహరిస్తున్న వ్యక్తి ఖాతాల్లోకి వెళ్లేవి. అందులో రూ.5 వేలు వారికి ఇచ్చే మీర్జా, జాఫర్ మిగిలిన మొత్తం తాము తీసుకునే వారు. ఇలా ఈ గ్యాంగ్ ఇప్పటి వరకు 60 వాహనాల క్రయవిక్రయాలకు పాల్పడి రూ.కోటికి పైగా స్వాహా చేసింది. దీనిపై సమాచారం అందుకున్న సౌత్-ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం జాఫర్ మినహా మిగిలిన ముగ్గురినీ అరెస్టు చేసి రూ.44.8 లక్షలు విలువైన 28 ఈవీలు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితులను మలక్‌పేట పోలీసులకు అప్పగించారు. లోతైన దర్యాప్తు చేస్తున్న పోలీసులు జాఫర్ కోసం గాలించడంతో పాటు ఈ స్కామ్‌తో పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్న ఫైనాన్స్ సంస్థల ఏజెంట్ల వివరాలు ఆరా తీస్తున్నారు. దీని కోసం మీర్జా, తన్వీర్, సచిన్, జాఫర్‌లను కోర్టు అనుమతితో తమ కస్టడీలోకి తీసుకోవాలని నిర్ణయించారు. వీరి ద్వారా సెకండ్ హ్యాండ్ మార్కెట్‌లోకి వెళ్లిన మిగిలిన వాహనాల కోసమూ ఆరా తీస్తున్నారు.

వైద్య కళాశాల ఏర్పాటు చేయండి



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: షాద్‌నగర్‌లో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్‌కు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే ప్రసంగించారు. విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేస్తే దేశం మరింత ముందుకుసాగుతుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా షాద్‌నగర్‌లో వైద్య, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ గురుకులాలను ఒకే గొడుగుకిందకు తెచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ఆలోచన మంచిదేనన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉమ్మడి కొందుర్గు మండలాన్ని విభజించి, నూతనంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలాన్ని ఏర్పాటు చేసిందని, కాని సౌకర్యాలు మరిచిందని విమర్శించారు. కొత్త మండలానికి కనీసం ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఏర్పాటు చేయలేదని, నేటికీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని వాపోయారు. కనీసం పీహెచ్‌సీ ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. అత్యంత ఎత్తైన షాద్‌నగర్ నియోజకవర్గంలోని లక్ష్మీదేవిపల్లిలో పాలమూరు ప్రాజెక్టు నిర్మాణం చేస్తామని గొప్పలు చెప్పిన నాటి ప్రభుత్వం.. ఆ ప్రాజెక్టును పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రాజెక్టును నిర్మించి, ఈ ప్రాంతాన్ని సశ్యశ్యామలం చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో కలెక్టర్ శశాంక్, పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణా రెడ్డి, నాయకులు శ్యామ్ సుందర్ రెడ్డి, కావలి రాజు, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ పేరుతో నగదు వసూలు

నిందితుడిపై కేసు నమోదు

సాక్షి,సిటీబ్యూరో: జలమండలి పరిధిలో పనిచేసే ట్యాంకర్ డ్రైవర్ నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదైంది. జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ నం.6 జూబ్లీహిల్స్ సెక్షన్ పరిధిలో ఎస్. వంశీకృష్ణ అనే వ్యక్తి ప్రైవేట్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. సాయికుమార్ అలియాస్ సాయిరామ్ అనే వ్యక్తి అతడికి ఫోన్ చేసి తాను జలమండలి విజిలెన్స్ విభాగంలో పని చేస్తున్నానని, బోర్డు నిబంధనలకు విరుద్ధంగా ట్యాంకర్ పనిచేస్తోందంటూ రూ.20 వేలు డిమాండ్ చేశారు. అనంతరం అతడి నుంచి రూ.3 వేలు వసూలు చేశాడు. బోర్డు విజిలెన్స్ అధికారుల దృష్టికి రావడంతో విచారణ చేపట్టారు. బోర్డుతో సాయికుమార్‌కు సంబంధం లేదని, కేవలం బోర్డు పేరు చెప్పుకుని అక్రమంగా నగదు వసూలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు ఖైరతాబాద్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఎవరైనా జలమండలి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా, బోర్డుకు చెడ్డ పేరు తీసుకువచ్చేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

పర్యావరణ పరిక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి



మొక్క నాటుతున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కందుకూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో లయన్స్‌క్లబ్ కందుకూరు అధ్యక్షుడు ఎస్.విఠల్‌రెడ్డి, కోశాధికారి కె.వెంకటేశ్వర్లు గుప్తా ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ చేపట్టే కార్యక్రమాల్లో పర్యావరణం సైతం ప్రధాన కార్యక్రమం అన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రీన్ హౌస్ వాయువుల ప్రభావం తగ్గించేందుకు ప్రతీ ఒక్కరు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ టీఏ రవికుమార్, సిబ్బంది పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



వసంత (ఫైల్)

మహేశ్వరం: యువతి అదృశ్యమైన సంఘటన మహేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు శుక్రవారం తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి సబిత ఇంద్రారెడ్డి కాలనీకి చెందిన రంగనాథ్ కుమార్తె చెల్లంగుల వసంత(22) పదో తరగతి వరకు విద్యనభ్యసించి ఇంటి వద్దే ఉంటుంది. ఈ నెల 3న ఉదయం రేషన్ దుకాణంలో బియ్యం తీసుకొస్తానని వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ చేసి ఉండడంతో, ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు స్థానికంగా గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. వసంత తల్లి అలివేలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం



వంశీ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

షాద్‌నగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ మైనర్ దుర్మరణం చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని దేవునిపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ గోపాల్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని దేవునిపల్లికి చెందిన అన్నదమ్ములు జశ్వంత్, ఓంకార్, మరో యువకుడు వంశీ(16) బైక్‌పై చించోడ్ వెళ్తున్నారు. అదే మార్గంలో ఓ ట్రాక్టర్ వెళ్తోంది. ఈ క్రమంలో డ్రైవర్ కృష్ణయ్య ట్రాక్టర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనకాల వస్తున్న బైక్ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న వంశీ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. జశ్వంత్, ఓంకార్‌కు స్వల్పగాయాలయ్యాయి. మృతుడి తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా దుర్గామాత పూజలు



దుర్గామాత సన్నిధిలో భక్తులు

ఆమనగల్లు: దేవి శరన్నవరాత్రోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. వేడుకల సందర్భంగా మండల పరిధి మంగళపల్లి గ్రామంలో హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో వైస్ ఎంపీపీ మాజీ సభ్యుడు జక్కు అనంత రెడ్డి-జ్యోతి దంపతులు, మాజీ సర్పంచ్ తిప్పిరెడ్డి నర్సింహారెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, ప్రభు, నితిన్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో అప్పులపాలు

- అవి తీర్చేందుకు చైన్‌స్నాచింగ్
- నిందితుడికి రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కేవీపీ రాజు, మాడ్గుల సీఐ జగదీశ్ చిత్రంలో నిందితుడు

ఇబ్రహీంపట్నం/మాడ్గుల: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసై అప్పులపాలైన ఓ వ్యక్తి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. ఈ నిందితుడిని మాడ్గుల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఏసీపీ కేపీవీ రాజు కేసు వివరాలు వెల్లడించారు. నల్గొండ జిల్లా డిండి మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్(32) నగరంలో బీటెక్ పూర్తి చేశాడు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో నివసిస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసైన ఆయన అప్పులపాలయ్యాడు. వాటిని తీర్చేందుకు చెరుకుపల్లిలోని పొలాన్ని సైతం అమ్మేశాడు. ఈ క్రమంలో ఈ నెల 7న తన బొలెరో వాహనంలో మాడ్గుల మండలం పాత బ్రాహ్మణపల్లి నుంచి ఇర్విన్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో జెల్లి లింగమ్మ(70) ఎర్రమట్టి కోసం ఒంటరిగా వెళ్తుండడం గమనించిన శ్రీకాంత్ ఆమెను మాటల్లో పెట్టి మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న మాడ్గుల సీఐ జగదీశ్, ఎస్‌ఐ నాగరాజు సీసీ పుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. బొలేరో వాహనం, బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించిన సీఐ, ఎస్‌ఐ, కానిస్టేబుల్స్ రాజశేఖర్‌రెడ్డి, సహదేవ్, రాజు, వినోద్‌ను ఏసీపీ అభినందించారు.

ఎరువుల నిల్వలు ఉంచండి

సహకార శాఖ జిల్లా అధికారి సుధాకర్



పీఏసీఎస్ గోదాంలో ఎరువులను తనిఖీ చేస్తున్న జిల్లా సహకార శాఖ అధికారులు

కందుకూరు: రైతుల అవసరాలకు తగినట్లుగా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉంచాలని సహకార శాఖ జిల్లా అధికారి సుధాకర్, సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం వారు మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. వరి ధాన్యం కొనుగోలుకు తగిన పరికరాలను సమకూర్చుకోవాలన్నారు. అనంతరం సొసైటీ పరిధిలో చేపట్టిన పనులను పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్ జిల్లా అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆనంద్, సంఘం కార్యదర్శి నిమ్మ యాదగిరిరెడ్డి, సిబ్బంది మహేశ్, పర్వతాలు, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

- ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన వింగర్
- మరో ఇద్దరికి గాయాలు



ఏవీలైన్ (ఫైల్)



ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన వ్యాన్

శామీర్‌పేట్: ట్రాక్టర్ ట్రాలీని వింగర్ వ్యాన్ ఢీ కొట్టిన ఘటనలో ఒక మహిళ మృతి చెందగా మరో ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన శుక్రవారం జినోమ్‌వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తుర్కపల్లి జినోమ్‌వ్యాలీ ఫేస్ 1లోని యూనిక్యూ బయోటెక్ ఫార్మా కంపెనీకి చెందిన ఉద్యోగులు శుక్రవారం ఉదయం వ్యాన్‌లో హైదరాబాద్ నుంచి కంపెనీకి వస్తున్నారు. వారి వాహనం మజీద్‌పూర్- తుర్కపల్లి వద్ద ముందు వెళుతున్న ట్రాక్టర్ ట్రాలీని ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ ట్రాలీ వింగర్ వ్యాన్ లోపలికి దూసుకెళ్ళింది. ఈ ఘటనలో వ్యాన్‌లో ముందు సీట్‌లో కూర్చున్న ఏవీలైన్(31), అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జినోమ్‌వ్యాలీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.